బళ్ళారి జిల్లాలో ఒక చిన్న గ్రామం...

ఆ గ్రామంలో చిన్నవ్ప ఒక పెద్ద మనిషి. లక్షాధికారి... కానీ అలా కనిపించడు. ఆయన సర్పంచ్‌కాడు. కనీసం పంచాయితీ మెంబరూకాడు. కానీ పంచాయితీని గుప్పిట్లో పెట్టుకున్న సమర్థుడు.

ఆయన పొలం గట్టుమీద నిలబడి—కలుపు తీస్తున్న కూలి పడుచుల పైటచాటు అందాలతో కళ్ళవిందు చేసుకుందుకు తనూ కొన్నంత వంగి మంచి యాంగిల్ కోసం తంటాలు పడుతున్నాడు.

అస్తాద్రి మాటున దాగిన ముసలి "సూర్యనారాయణ మూర్తి" చిన్నవ్ప అవస్థ చూసి నవ్వుకున్నాడు. ఆ నవ్వు కరిగిన బంగారంలా భూమి అంతటా పరుచుకుంది.

"చూడు, చూడు చిన్నవ్ప అవస్థ!" తూర్పుకొండ శిఖరం చెవిలో చిన్నగా చెప్పింది చిరుగాలి. కొండ నవ్వింది. చిరుగాలీ నవ్వింది ఇంతలో కొంటె ఊహ ఏదో గలగల లాడగా చిరుగాలి పెనుగాలిగా విజృంభించి ఒక్క ఊవు ఊపేసింది.

ఆగాలి తాకిడికి ఉల్లితోట పడీపడీ పగలబడి నవ్వగా కూలి పడుచుల పైటలు రెపరెప లాడాయి! ఆయన దృష్టి పదేపదే ఈరమ్మ మీద పడుతోంది. ఆ పిల్లయింకా పైట వేయలేదు.

ఆనాటికి పని ముగించి, బోరవెల్ దగ్గర కాళ్ళూ చేతులూ కడుక్కుని, ఎగగట్టిన చీరకుచ్చిళ్ళు ఊడదీసు కోవడంలో—చీర మడతల్లో దాచుకున్న ఉల్లికాడలూ, ఉల్లిపాయలూ భళ్ళున కిందపడి దొర్లి పోతేంటే—యజమాని కంటపడకుండా వాటిని దాచే ప్రయత్నంలో వున్నారు కూలీలు.

అదృష్ట వశాత్తు చిన్నవ్ప దృష్టి అటు లేదు కొద్ది దూరంలో చెట్టుకింద ఒంటరిగా కూచున్న ఈరమ్మ మీద వుంది.

తండా నాయకు రాలికి మొత్తం కూలి యిచ్చి—'ఈరమ్మని యిటు రమ్మను'—అన్నాడు చిన్నవ్ప.

"ఏం దొరా, పిల్చినావా?" వినయంగా ఒంగి నిల్చుంది ఈరమ్మ.

"దొర సానికి ఒంట్లో బాగుండలేదే. ఇంటిపని చేసుకో లేకపోతోంది. పొలం పని నీకెందుకు గాని మా యింట్లో పని చేస్తావా?" అడిగాడు చిన్నవ్ప వంకరగా చూస్తు.

ఇంటి చాకిరి కంటే పొలం పని సుఖం. కూలి ఎక్కువ.

"సాకిరి నేఁ జేయలేను దొరా!" అంటూ చెంగున ఒక్క గంతువేసి నాయకురాలి దగ్గర కూలి తీసుకుని తుర్రున పారిపోయింది ఈరమ్మ. అటువైపే చూస్తూ ఆలోచిస్తూ ఉండి పోయాడు చిన్నవ్ప.

* * * *

"ఎల్లమ్మ తల్లి జోగి కొచ్చింది తల్లీ!... అమ్మా! జోగి! తల్లీ! జోగి!"

గుమ్మం వద్ద నిలిచి దేవదాసీల తండా అరుస్తోంటే చిన్నవ్ప భార్య చేటలో పిడికెడు బియ్యం, రెండు



ఉల్లిపాయలు, కొన్ని ఉల్లికాడలూ వేసుకుని వచ్చింది.

దేవదాసీలు—ఎల్లమ్మ దేవతకు అంకితమైనవారు. మంగళ, శుక్రవారాల్లో మాత్రమే వాళ్లు భిక్షాటనకు వస్తారు. కొందరి మెడలో ఎర్ర, తెల్లని పూసల దండలున్నాయి. దేవదాసీలే అలాంటి దండలు ధరిస్తారు.

భార్య వాళ్ళకి భిక్షం వేస్తొంటే వీధి అరుగు మీద నిలచి చూస్తున్నాడు చిన్నప్ప.

భార్యలోనికి వెళ్ళగా—దేవదాసీలు కదలబోతొంటే—

"చంద్రీ! యిలా రావే!" అని పిలిచాడు చిన్నప్ప.

మిగిలిన వాళ్ళు సాగిపోగా చంద్రి ఆగిపోయింది.

"రాత్రి వస్తాను. మంచం కాళీయేనా?" అడిగాడు చిన్నప్ప.

ఒక్క సారిగా నీరసం ఆవహించిందామెను. ముఖంలో వెలుగు ఆరిపోగా "తమ దయ దొరా!" అంటూ నిర్లిప్తంగా ముందడుగు వేసింది.

చింకి తడికల గోడలు, చెదపట్టిన ఆకుల పైకప్పు—గల ఆ పాకలో కుక్కి మంచం మీద ఆనందాలు వెదుక్కోడాన్కి వచ్చిన చిన్నప్ప "ఛీ ఛీ ఏమిటీ, ఉల్లి కంపు!" అన్నాడు చీదరగా ముఖం పెట్టి.

"ఉల్లిలో పుట్టాం. ఉల్లిలో పెరిగాం. ఆ ఉల్లి పాయలే తిని బ్రతుకుతున్నాం. ఈ ఊళ్ళో ఉల్లికాక మల్లి వాసన ఎక్కడనుండి వస్తుంది? ఉల్లి కంపు అంత చీదరగా వుంటే, పట్నం పోయి కావలసిన సువాసనలు వెతుక్కోకూడదూ, పీనాసి వెధవా!" కసిగా అనుకుంది చంద్రి—కుక్కి మంచం మీద ఆయన ప్రక్కనే కూచుంటూ.

చిన్నప్ప తొందర పడలేదు. దీర్ఘాలోచనలో ఉండిపోయాడు.

"ఏమిటీ విశేషం?" మంచం మీంచి లేచి, ఆయన ఎదురుగా కిందకూచుంటూ అడిగింది చంద్రి.

"చంద్రీ! ఇంకెన్నాళ్ళే నీకీ దర్శనం?!" ఆమె మెడలో ఎర్ర తెల్లని పూసల దండవైపు చూస్తూ అడిగాడు చిన్నప్ప.

ఆ దండని "దర్శనం" అంటారు. పుష్పవతికాని అమ్మాయిని దేవ దాసిగా మార్చి, అపిల్ల మెడలో ఈదండవేసి ఒదుల్చుకుంటేగాని చంద్రికి మోక్షం లభించదు! నరకంలో పడిపోతుంది!

"సరియైన పిల్లకోసమే వెదుకుతున్నా దొరా!" అంది చంద్రి తలవంచుకుని.

"బసప్ప కూతురు ఈరమ్మ ఉందిగా! దాన్ని రంగంలోకి లాగు... నీకు విముక్తి!" వెకిలిగా నవ్వాడు చిన్నప్ప.

తర్వాత చంద్రితో కాసేపు కాలక్షేపం చేసి చిరిగిపోయిన రూపాయి నోటు దాని చేతిలో కుక్కి, వెళ్ళిపోయేముందు ఈరమ్మ సంగతి మళ్ళీజ్ఞాపకం చేసాడు చిన్నప్ప.

బాగా మాసిపోయి, చిరుగులు పట్టి, గట్టిగా పట్టుకుంటేనే నాలుగు ముక్కలయేట్టు అసహ్యంగా వున్న రూపాయి నోటు వైపు చూస్తూ ఉండిపోయింది చంద్రి.

ఆమె జీవితమూ ఆ రూపాయినోటు లానే ఉంది! ఆమెకు—ఏడవడాన్కి ఓపికాలేదు. కార్చడాన్కి కన్నీరూ లేదూ. చింతించడాన్కి మాత్రం ఓ మనసుంది! ఆ మనసు గతంలోకి కుంటుతూ వెళ్ళింది...

రోగాలు ఎందుకు వస్తాయో, ఎలా పోతాయో గాని—చంద్రి కొంప ముంచడానికే—ఆమె తల్లికి మాయదారి రోగం దాపురించింది. వంటి నిండా దద్దుర్లు; దురద. గచ్చాకు, పుచ్చాకు వాడినా గుణం కనిపించలేదు.

"నాకు నయం చేయి తల్లీ! నాకూతుర్ని నీకు సమర్పించుకుంటా" అని ఎల్లమ్మ దేవతకు మొక్కుకుంది చంద్రి తల్లి. మరో రెండు రోజులకు దద్దుర్లు దురదా తగ్గాయామెకి. అప్పుడు చంద్రి వయస్సు పన్నెండు.

ఆ తర్వాత వచ్చిన మాఘ పౌర్ణమినాడు జరిగిన తతంగం అంతా చంద్రి గుండెల్లో చెరగని ముద్ర వేసింది.

ఆ రోజు తలిదండ్రు లామెను సౌందత్తి గ్రామం తీసుకు వెళ్ళారు. అక్కడ ఎల్లమ్మ తల్లి ఆలయం వుంది. ఆరోజు తిరునాళ్ళు. ఇసుక వేస్తేరాలని జనం! పుచ్చపువ్వులా వెన్నెల... దారి చేసుకుని అతికష్టంగా సత్రం చేరుకున్నారు.

కొందరు దేవదాసీలు చంద్రి చుట్టూ చేరారు. ఆమె ధరించిన దుస్తులు పూర్తిగా విప్పేసారు! చచ్చేచావు అయిందామెకు. అయితే చుట్టూ చాలమంది పిల్లలు దిగంబరంగానే వున్నారు. కాస్త ధైర్యం తెచ్చుకుంది చంద్రి.

ఒళ్ళంతా నూనె రానుకో మన్నారు... రానుకుంది. మొలచుట్టూ వేప మండలు కట్టి, దగ్గరలో వున్న నూతి వద్దకు వెళ్ళి స్నానం చేసి రమ్మన్నారు. సంకోచిస్తూనే వెళ్ళి స్నానం చేసి వచ్చింది చంద్రి.

ఐదుగురు దేవదాసీలు పాటలు పాడుతూ చంద్రికి పసుపు పొత్తి కట్ట బెట్టారు. ఆకు పచ్చగాజులు తొడిగారు. పెళ్ళి కూతురులా అలంకరించారు. అక్షతలు వేసారు. ఆమెను ఆలయంలోకి తీసుకువెళ్ళి, ఎల్లమ్మ దేవత విగ్రహం ముందు కూచోబెట్టి కలశ పూజ చేయింటారు. తర్వాత అనేక ప్రమాణాలు చేయించారు. అందులో ఒకటి—"అడిగిన మాగాడికి లేదనకుండా నన్నునేను అర్పించుకుంటాను!"

చిలక పలుకుల్లా ప్రమాణాలు పలికింది చంద్రి. వాటి అర్థం, అనర్థం అప్పుడామెకు తెలియవు. చెప్పినట్టు చేసింది. ఇదంతా ఏమిటని అడిగే సాహసంలేదామెకు.

ఒక దేవదాసి—చంద్రి మెడలో మంగళ సూత్రం కట్టి, తనుధరించిన "దర్శనం" తీసి ఆమె మెడలో వేసింది. అంతే ఆ క్షణంనుండి చంద్రి—ఎల్లమ్మ దేవతకు అంకితమై, ఆ తల్లినే పెళ్ళి చేసుకున్న—దేవదాసి! ఆమెకాక్షణంలో తెలియదు—ఒకపురుషుని వివాహమాడి, సుఖసంసారం చేసుకునే అర్హత తనకింక లేదనీ—ఆ ఎర్ర, తెల్ల పూసల దర్శనం—కామం తీర్చుకోడాన్కి యిదిగో అమ్మాయి—అని ప్రతి మగ వాడినీ ఆహ్వానించే లైసెన్స్ అనీ—తను ధరించింది మంగళసూత్రం కాదు, ఉరితాడు అనీ—

ఆ విధంగా ఆ వెన్నెలరాత్రి—అభం శుభం తెలియని నాలుగు వేల అమాయకు రాళ్ళ భవిష్యత్తుని—వెయ్యేళ్ళ ఆచారం—బుగ్గిపాల్జేసింది. ప్రతీయేడూ—వేసవేలు అభాగినులకు అలా ఉరితాడు పడుతూనే వుంది.

చంద్రి పుష్పవతి అయిన తర్వాతనే—తన భవిష్యత్తు ఎంత అంధకార బంధురమో—తెలిసి వచ్చిందామెకు. అనాడు రచ్చబండమీద అమెనుకూచో బెట్టి, వెనుక నిలుచున్నారు తలిదండ్రులు.

ఆవార్త ఈనోటా, ఆనోటా ప్రాకి, పాతికమంది కామాంధులైన కామందులు రాబందుల్లా రచ్చబండ వద్దవాలారు. "చంద్రిని నేనుంచు కుంటా అంటే నేనని" తగవు లాడుకున్నారు—చెన్నప్ప, చిన్నప్ప, గుండప్ప, లింగప్ప... తలవంచుకుని కూర్చున్న చంద్రికిదంతా కంపరంగావుంది.

చివరకు వాళ్ళంతా ఒక ఒప్పందానికి వచ్చారు. చిన్నప్ప ముందు కొచ్చి, చంద్రి తండ్రికి చెప్పాడు "ఒరేయ్, మంచిరోజు చూచి కబురు పెడతా. అప్పుడు దీన్ని మా చిన్నింటికి తోలెయ్"... పెద్దలు వెళ్ళిపోయారు.

ఏ మగాడికీ అక్కర లేని దేవదాసి—భక్తి గీతాలు పాడుతూ కాలక్షేపం చేస్తుంది. ఆమెను జోగితి అంటారు. చంద్రి—జోగితి సుశీలకు తన దురవస్త చెప్పుకుని ఏడ్చింది.

సుశీల జుట్టు అంటుకుని లావుపాటి చీపురు కట్టలా తయారైంది. మోకాలు వరకూ వ్యాపించిన ఆ జటాజూటాన్ని మోసుకోలేక అవస్త పడుతూ వుంటుంది. ఆ కేశభారం వల్ల ఆమెకు తలనొప్పి నడుము పీకుడూ. శుభ్రంగా గుండు గీయించుకోవాలనిపిస్తూ ఉంటుంది సుశీలకు. కాని ఎల్లమ్మతల్లి ఆగ్రహిస్తుందని అంత సాహసం చేయలేక పోయింది. ఆ జటాజూటాన్ని ఎత్తైన అరుగు మీద మోపి, తనేమో కిందకూచుంటుంది సుశీల. ఆమె కాస్తో, కూస్తో చదువుకుంది. పైగా చదువుకున్న వాళ్ళతో సంపర్కం ఉన్నదీ—కనుక చక్కగా మాట్లాడగలదు.

చంద్రి దురవస్తవిని, శుష్కహాసం చేసి, దేవదాసి వ్యవస్థ గురించి చెప్పుకొచ్చింది సుశీల.

మహర్షి జమదగ్నికి భార్య రేణుక మీద అనుమానం కలిగి కొడుకు పరశురాముని పిలిచి—తల్లిని చంపివేయమని ఆజ్ఞాపించాడు. కొడుకు అలాగే చేసాడు. అందుకు తండ్రి సంతోషించి వరరం కోరుకోమంటే—తల్లిని బ్రతికించ మన్నాడు పరశురాముడు. ఆసమయాన ఆ దారిన పోతున్న మతంగకన్య తలనరికి, ఆతలను భార్య మొండేనికి అతికి ప్రాణం పోసాడు జమదగ్ని. పునర్జన్మ పొందిన రేణుక—ఎల్లమ్మగా అవతరించింది. కన్యలు తమ జీవితాన్ని ఎల్లమ్మకూ శరీరాల్ని ఆమె కొడుకు పరశురాముడికీ అర్పించుకుంటే పుణ్యం! మోక్షం!

ప్రతి మగవాడిలోనూ పరశురాముని అంశ ఉంటుందట! అందుకని—కుంటి, కుష్టు, గుడ్డి అనే

భేదం లేకుండా కోరిన ప్రతి మగవాడికీ మంచం వాల్చాలట దేవదాసి! అదీపురాణం!

"న్యాయాన్నీ ధర్మాన్నీ తప్పించుకొని వెక్కిరించడాన్కి కామాంధుడెవడో ఈ పుక్కిటి పురాణాన్ని రాస్తే—తేరగా అనుభవించే అవకాశం ఒదులుకోలేని పురుష పుంగవులు ఆ పురాణ ప్రచారం చేసారు. ఆ పురాణం మన పాలిట శాపం అయింది. మరో అన్యాయం చూసావా? అగ్రకులస్థులు కూడా ఎల్లమ్మ దేవతను పూజిస్తారు. కాని వాళ్ళెవరూ తమ కూతుళ్ళను ఆతల్లికి అర్పించరు! బలహీన వర్గాల స్త్రీలే ఈ అన్యాయానికి బలి అయిపోతున్నారు" ఆవేశంగా అంది సుశీల.

తలిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుండి దైవభక్తి, పాపభీతి నరనరాల్లోనూ ఎక్కిస్తారు. ఆచారాలూ, కట్టు బాట్లూ రంగరించి ఉగ్గుపాలతో పడతారు. ఆ పిల్లలు పెద్దయాక—ఆచారం పేరిట జరుగుతున్న సాంఘిక దురాచారాల్ని ఎదిరించాలని ఆవేశం కలిగినా, పాపభీతి వాళ్ళగొంతు నొక్కేస్తుంది. చేతులు కట్టేస్తుంది. మెదడు మొద్దుబారి, సాంప్రదాయాన్కి బలి అయిపోతూ వుంటారు. ఈదురాచారాన్ని ప్రతిఘటించలేక చంద్రి కన్నీళ్ళు పెట్టుకుంటే, సుశీల నిస్సహాయంగా నిట్టూర్చింది. అంతే వాళ్ళు చేయ గలిగింది!

వారివారి హోదాల ప్రకారం చిన్నప్ప, చెన్నప్ప మొదలైన కామందులు ఏడాది, రెండేళ్ళు చొప్పున చంద్రిని ఉంచుకుని, ఆమెలోని కళ, కాంతి, అందం, యవ్వనం జుర్రుకుని—చివరకు పుల్లాకును పెంట మీదకు విసిరేసినట్టు—విసిరేస్తారు. ఇప్పుడు చిన్నప్ప కన్ను ఈరమ్మ మీద పడింది. దర్శనం ఒదుల్చుకోకపోతే చంద్రికి మోక్షంలేదు. అందుకని—యిష్టంలేక పోయినా, ఈరమ్మను రొంపిలోకి దింపడాన్కి పథకం ఆలోచించింది చంద్రి.

ఆరోజు—వీధి అరుగుమీద నిలబడి ఈరమ్మతో మాట్లాడుతూ ఉండగా చంద్రి శరీరం ఒణికి పోయింది. జుట్టుముడి ఊడిపోయింది. తల ఊగిపోతోంటే, విరబోసిన జుట్టు కాలమేఘంలా కదలాడు తోంటే "ఒరేయ్ బస్సప్పా!" అని అరిచింది చంద్రి.

ఇంటిల్లిపాది అందరూ ఆమె చుట్టూ మూగారు. చంద్రిని ఎల్లమ్మ దేవత ఆవహించిందని గ్రహించి దీపధూప నైవేద్యాలు అర్పించారు.

"ఒరేయ్ బసప్పా! మీ వంశంలో ఎవరూ నాకు పిల్ల నివ్వలేదురా! ఎంత పొగరు! పొగరు అణిచేస్తానురో బసప్పా! నీపిల్లని నాకివ్వు! లేకపోతే దుంప నాశనం! హూ...." దీర్ఘంతీసి హూంకరించి కుప్పకూలి పోయింది.

అంతే. మాఘపౌర్ణమినాడు ఈరమ్మ దర్శనం ధరించింది!

ఆ మర్నాడే చంద్రి తన పాకలో ఎల్లమ్మ దేవత పటం ముందు పద్మాసనం వేసుకుని పటం వైపు నిశ్చలంగా చూస్తూ కటిక ఉపవాసం పాటించింది. ఒకరోజు... రెండు రోజులు... మూడు...

నాలుగో రోజు చంద్రి చచ్చిపోయింది. పుణ్యాత్మురాలు—అన్నారు దేవదాసీ లందరూ. బాజాలూ, భజంత్రీలతో తీసుకు వెళ్ళి భూదేవి గర్భంలో చేర్చారు ఆమెను.

ఎవరైనా ఆమె హృదయాన్ని చీల్చి లోనికి ప్రవేశించ గలిగితే, అక్కడ ఘనీభవించిన భావాల్ని చదవగలిగితే—ఆమె చివరి కోరిక ఏమిటో తెలిసేది!

* * * *

ఒంటి నిండా సెంటు పట్టించి, నిత్య పెళ్ళి కొడుకులా చిన్నింటిలో ప్రవేశించిన చిన్నప్ప—ఈరమ్మను చూసి నిర్ఘాంత పోయాడు.

ఈరమ్మ మంచం మీద నిలుచుని ఉంది. ఆమె కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. జుట్టు విరబోసుకుని ఉంది. చిన్నప్పలోనికి రాగానే మంచం మీదనుండి కిందకు దూకి, దయ్యం పట్టిన దానిలా ఊగిపోతూ—

"ఒరేయ్ చిన్నప్పా! నేనెవరను కుంటున్నావ్? ఎల్లమ్మ తల్లిని! నాకు పూజ చేయకుండా, నాకు మొక్కకుండా నాభక్తురాలి మీద చేయి వేయడాన్కి వచ్చావా? వారం రోజులు పూజలు జేసి అప్పుడు రారా! ఫో!... ఇంకా నిలుచున్నావేరా, పోరా, ఫో" అని గర్జించింది.

అపరకాళిలా ఉన్న ఈరమ్మని చూసి నిజంగానే ఝుడుసుకున్నాడు చిన్నప్ప కాని "నాటకం ఆడు తోంది—! రేపు దీని పని పడతా" అని తిట్టు కుంటూ పెద్దింటికి పోయాడు.

* * * *

వరకట్న నిషేధ చట్టంలానే, దేవదాసి నిషేధ చట్టమూ—లాయర్ల యిళ్ళలోని బీరువాల్లో దుమ్ము పట్టిన పుస్తకాల్లో యిరుక్కుని గిజగిజ లాడుతోంది. 'సాంప్రదాయాన్ని ధిక్కరించే ధైర్యం వుంటే—పూనాలో దేవదాసి విమోచన సంస్థకు పారిపో—'అని జోగిత సుశీల యిచ్చిన సలహా ప్రేరేపించగా—పూసల దండ తెంచి పారేసింది ఈరమ్మ. క్షణం ఆలస్యం చేయకుండా—చీకటి మేసిన ఆచిరు గ్రామంలోని కామ పిశాచాల కబంధ హస్తాలకు అందనంత దూరంగా—వెలుగును అందుకోవాలన్న ఆరాటంతో—గుండె అరచేత బట్టుకుని పరుగు ప్రారంభించింది.

అలా గ్రామం విడిచి పారి పోయిన వాళ్ళలో ఈరమ్మ మొదటి వ్యక్తికాదు. చివరి వ్యక్తీకాబోదు! కాని ఆమెకంటే ముందుగా ఆ చీకటిలోంచి పారిపోయిన చాల మంది బొంబాయి వేశ్యాగృహాల్లోని కారు చీకటిలో కూరుకు పోయారు! మరి ఈ ఈరమ్మకు వెలుగు దక్కుతుందా? కారు చీకటే మిగులుతుందా?.... మనం చెప్పలేం.

ఒక సాంఘిక దురాచారానికి బలి అయిపోయినా, పుత్తడి బొమ్మ పూర్ణమ్మకు సాహిత్యంలో శాశ్వత స్థానమూ, కడవల కొద్దీ సహృదయుల కన్నీరూ లభించాయి. మరి ఈ యిత్తడి బొమ్మ ఈరమ్మకు దోసెడు కన్నీళ్ళయినా దక్కుతాయా?!

****



ఎమ్. సావిత్రీదేవి

మండా సావిత్రిదేవి గాత్రంలో 'డిప్లొమా' తీసుకున్నారు. సికిందరాబాద్‌లోని 'భక్త రామదాసు ప్రభుత్వ సంగీత కళాశాలలో' వోకల్ (గాత్రం) టీచర్‌గా పనిచేస్తున్నారు. శ్రీమతి మండా సావిత్రిదేవి పుట్టుకతో అంధురాలు, ఈమెకి 'ప్రకృతి'లోని ఏ సుందర దృశ్యాలు తెలియవు. 'కోకిల' ఎలా ఉంటుందో తెలియదు. కోకిల రాగాలు ఎలా ఉంటాయో తెలియదు. కాని శ్రీమతి సావిత్రి కంఠంలో కోయిల రాగాలు వినిపిస్తాయి మనకి. ఈమెకి భర్త - ఒక బాబు, ఒక పాప ఉన్నారు.

శ్రీమతి సావిత్రి పుట్టుకతో అంధురాలు అయినా జీవితం గురించి నిరాశపడక ధైర్యంతో ముందడుగు వేశారు. ఆమె రేడియోలో ఎన్నో ప్రోగ్రాంలు ఇచ్చారు – ఇస్తున్నారు కూడా.

—పి. ఇందిరాదేవి